ఆంధ్రజ్యోతి
andhrajyothy.com మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 35.3 : కనిష్ఠం 21.5



విద్యతోనే సంపూర్ణ అభివృద్ధి : ప్రత్యేకాధికారి

ఉట్నూర్, ఫిబ్రవరి 6: చదువుతోనే సంపూర్ణ అభివృద్ధి సాధ్యమవుతుందని గురుకులాల ప్రత్యేక అధికారి ఏకాంబరం అన్నారు. మండలంలోని లాల్‌టేకిడి గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాలను ఆయన సందర్శించి పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న మౌలిక సేవలతో పాటు వసతి సౌకర్యా, ఉపాధ్యాయుల బోధన తీరు విషయమై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో వంద శాతం ఫలితాలు వచ్చేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామ్మోహన్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



అమ్మేందుకు మార్కెట్ యార్డుకు తీసుకొచ్చిన కందులు (ఫైల్)

కాసులు కురిపిస్తున్న.. కందులు!

- జిల్లాలో మద్దతును మించి ధర పలుకుతున్న కంది పంట దిగుబడులు
- ప్రభుత్వ మద్దతు ధర రూ.7వేలు కాగా, ప్రైవేట్‌లో రూ.11వేలు
- ఈయేడు 3లక్షల 60వేల క్వింటాళ్ల వరకు దిగుబడులు వచ్చే అవకాశం
- వెలవెలబోతున్న మార్క్‌ఫెడ్ కందుల కొనుగోలు కేంద్రాలు
- నామమాత్రంగానే కమర్షియల్ కొనుగోళ్లు
- అక్కడక్కడ దళారీ దందాతో నష్టపోతున్న కంది సాగు చేసిన రైతులు
- జిల్లావ్యాప్తంగా అంతర్‌పంట పంటగానే కాకుండా విడిగా 60వేల ఎకరాల్లో సాగైన కందులు

ఆదిలాబాద్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రధానంగా సాగు చేసే కంది పంట అన్నదాతకు కాసులు కురిపిస్తోంది. మునుపెన్నడూ లేని విధంగా ఈ యేడు మద్దతును మించిన ధర పలకడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ యేడు జిల్లావ్యాప్తంగా అంతర్ పంటగానే కాకుండా విడిగా సుమారుగా 60వేల ఎకరాలలో కంది పంట సాగైనట్లు వ్యవసాయ శాఖాధికారుల లెక్కల ప్రకారం తెలుస్తుంది. దీంతో 3లక్షల 60వేల క్వింటాళ్ల వరకు దిగుబడులు వచ్చే అవకాశం ఉందని తెలుస్తుంది. కానీ ఇప్పటి వరకు మార్క్‌ఫెడ్ కనీస స్థాయిలో కొనుగోలు చేసినట్లు కనిపించడం లేదు. జనవరి 20న జిల్లా వ్యాప్తంగా కందుల కొనుగోళ్లను ప్రారంభించిన రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు కందులను తరలించడం లేదు. ఇప్పటికే కొంత మంది రైతులు అత్యవసరాల పేరిట దిగుబడులను అమ్మేసుకున్నారు. అయితే ఈసారి వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతో ఎకరాన ఆరు క్వింటాళ్ల నుంచి ఎనిమిది క్వింటాళ్ల వరకు దిగుబడులు వస్తాయని అధికారులు అంచనా వేశారు. అయితే దిగుబడులు భారీగా తగ్గాయని రైతులు పేర్కొంటున్నారు. ఎకరాన నాలుగు నుంచి ఐదు క్వింటాళ్ల వరకు మాత్రమే దిగుబడులు వస్తున్నాయని రైతులు చెబుతున్నారు. ఏదిఏమైనా మద్దతును మించిన ధర పలకడంతో కంది రైతులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

క్వింటాలు రూ.11వేలు

ప్రభుత్వం నిర్ణయించిన కంది పంట మద్దతు ధర రూ.7వేలు కాగా ప్రస్తుతం బయట మార్కెట్‌లో రూ.11వేల ధర పలుకుతోంది. దీంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులకే పంటను అమ్మేసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. స్థానికంగానే దళారులు కందులను కొనుగోలు చేసి మహారాష్ట్రలో క్వింటాలు రూ.11 వేల వరకు అమ్మేసుకుంటున్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దళారులు రైతుల నుంచి రూ.10వేల లోపే పంటను కొనుగోలు చేస్తూ అధిక ధరలకు విక్రయిస్తున్నారు. పంట నాణ్యత, తేమ శాతం పేరిట భారీగా కోతలు విధిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 17తేమ శాతం ఉన్న క్వింటాలు కందులకు రూ.7వేలు చెల్లిస్తారు. కానీ ప్రైవేట్‌లో మాత్రం 25 తేమ శాతం ఉన్న రూ.10వేలకు పైగా ధర పలుకుతుంది. మార్కెట్ పరిస్థితులపై ఏ మాత్రం అవగాహన లేని అన్నదాతలు ఆదరబాదరగా పంటను అమ్మేసుకుంటు నష్టపోతున్నారు. అయినా అధికారులు అడ్డుచెప్పే ప్రయత్నం చేయడం లేదు. మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా ధరను చెల్లించి కొనుగోలు చేయాల్సిన మార్క్‌ఫెడ్ అధికారులు నిబంధనల పేరిట చేతులెత్తేస్తున్నారు.



బోణీ కొట్టని మార్క్‌ఫెడ్

జిల్లాలో మార్క్‌ఫెడ్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా కందులను కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లను చేసినా.. కంది పంట దిగుబడులు రాకపోవడంతో కొనుగోలు కేంద్రాలన్నీ వెలవెలబోతున్నాయి. కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి పక్షం రోజులు గడుస్తున్నా.. కేవలం వంద క్వింటాళ్ల లోపే పంట దిగుబడులను కొనుగోలు చేసినట్లు తెలుస్తుంది. బయట మార్కెట్‌లో మద్దతు ధరను మించి రూ.4వేలు అదనంగా ధర పలకడంతో రైతులు బయట మార్కెట్‌లో విక్రయించేందుకే ఆసక్తి చూపుతున్నారు. దీంతో చేసేది ఏమీ లేక మార్క్‌ఫెడ్ అధికారులు రైతుల కోసం ఎదురుచూస్తున్నారు. పంట డబ్బుల చెల్లింపుల్లోనూ ఆలస్యమవుతుందన్న కారణంగా రైతులు మార్క్‌ఫెడ్‌కు పంటను విక్రయించేందుకు ముందుకు రావడం లేదు. ఇలాంటి కారణాలతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు కాకుండా ప్రైవేట్ వ్యాపారులకు పంటను విక్రయిస్తున్నారు.

వాణిజ్య కొనుగోళ్లు ఉత్తమాటేనా?

ఈయేడు కందులకు మద్దతును మించిన ధర పలకడంతో మార్క్‌ఫెడ్ వాణిజ్య కొనుగోళ్లను చేపడుతామని మొదట ప్రకటించింది. కానీ ఆచరణ సాధ్యం కాకపోవడంతో నామమాత్రంగానే కొనుగోళ్లు చేపడుతుంది. బయట మార్కెట్‌లో క్వింటాలు కందులు రూ.11 వేలు ధర పలుకగా.. వాణిజ్య కొనుగోళ్ల పేరిట మార్క్‌ఫెడ్ రూ.10,045లను చెల్లిస్తుంది. దీంతో అధిక ధరకే రైతులు అమ్మేసుకుంటున్నారు. బయట మార్కెట్‌లో ఉన్న దరకే మార్క్‌ఫెడ్ కొనుగోలు చేయాల్సి ఉండగా.. ధరను తగ్గించి కొనుగోలు చేయడంతో రైతులు నష్టపోవాల్సి వస్తుంది. ప్రైవేట్‌కు ధీటుగా కొనుగోలు చేపట్టాల్సిన మార్క్‌ఫెడ్ అవేమీ పట్టించుకోవడం లేదంటున్నారు. దీంతో క్వింటాలుకు రెండు కిలోల చొప్పున ప్రైవేట్ దళారులు కోతలు విధించడంతో రైతులు నష్టపోతున్నారు. పేరుకే వాణిజ్య కొనుగోళ్లను చేపడుతున్నామని చెబుతున్నా.. మార్క్‌ఫెడ్ బయట మార్కెట్ ధరను చెల్లించక పోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాగే కొనుగోలు చేసిన తేమ శాతం పేరిట కొర్రీలు పెడుతున్నారని రైతులు చెబుతున్నారు. ఇలాంటి ఇబ్బందులు నష్టాలను తట్టుకోలేక రైతులు ప్రైవేట్‌కే పరుగులు తీస్తున్నారు.

కొనుగోలు కేంద్రాలకు కందులు రావడం లేదు

: శ్రీనివాస్, మార్కెటింగ్ ఏడీ, ఆదిలాబాద్



కందులకు మద్దతును మించిన ధర పలకడంతో ప్రభుత్వ కొనుగోళ కేంద్రాలకు రైతులు కందులను తీసుకు రావడం లేదు. మార్క్‌ఫెడ్ కమర్షియల్ కొనుగోళ్లను ప్రారంభించినా.. నామమాత్రంగానే వస్తున్నాయి. ధర అధికంగా ఉండడమే ఈ పరిస్థితికి అసలు కారణం. మహారాష్ట్రలోనూ ధర అధికంగానే ఉంది. కొంతమంది రైతులు మహారాష్ట్రకు తీసుకెళ్లి కందులను అమ్మేసుకుంటున్నట్లు తెలుస్తుంది. ఏదిఏమైనా కందులకు మంచి ధర రావడంతో రైతులకు లాభదాయకంగా మారింది.

సంక్షిప్త సమాచారం



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం

'చిత్రాలు, వీడియోలను బహిర్గతం చేస్తే కఠిన చర్యలు'

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 6: మహిళలు, చిన్న పిల్లలపై జరిగిన లైంగిక వేధింపులకు, ఆత్యాచార కేసులకు సంబంధించిన వీడియోలను, ఫొటోలను బహిర్గతం చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ గౌస్ ఆలం హెచ్చరించారు. లైంగిక వేధింపుల వీడియోలు, ఫొటోలు పరస్పరం వాట్సాప్ గ్రూపులు, సోషల్ మీడియాలో పోస్టు చేసిన వారిపై చర్యలు తప్పవన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు లైంగిక వేధింపులు లేదా ఆత్యాచారానికి సంబంధించిన వీడియోలను, పేర్లను బహిర్గతం చేయరాదని తెలిపారు. సెక్షన్ 23 ఫోక్సో చట్టం ప్రకారం ఇలాంటి సున్నితమైన అంశాలలో తలదూర్చిన, ఇలాంటి పనులు చేసినా చట్టం దృష్టిలో శిక్షార్హులని ఎస్పీ పేర్కొన్నారు.

ఆర్‌సెట్ ఆధ్వర్యంలో ఉపాధి శిక్షణ

ఉట్నూర్, ఫిబ్రవరి 6: మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ ఉపాధి శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో నిరుద్యోగులకు ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని గ్రామీణ ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ కుమ్ర లక్ష్మణ్ తెలిపారు. కుట్టు మిషన్, మగ్గంవర్క్స్, బ్యూటీ పార్లర్, జ్యూట్ బ్యాగ్స్ మేకింగ్, టు వీలర్ రిపేర్, హౌజ్ వైరింగ్, ఏసీ రిపేరింగ్, సెల్‌ఫోన్ రిపేరింగ్, సీసీ కెమెరా టీవీల రిపేరింగ్, ఫొటోగ్రఫిలలో శిక్షణ ఇవ్వనున్నామని తెలిపారు. ఉచిత భోజన వసతితో పాటు ఇంటికి వెళ్లడానికి డబ్బులు, ఒక జత యూనిఫాం, టూల్ కిట్స్ అందిస్తామన్నారు. పదవ తరగతి వరకు చదువుకున్న 18నుంచి 45 ఏళ్లలోపు ఆసక్తి ఉన్న వారు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఈ నెల 10 వరకు దరఖాస్తులు చేసుకోవాలని, మిగతా వివరాల కోసం ఫోన్ నెంబర్లు 9441530494, 8096039085 ద్వారా సంప్రదించాలని పేర్కొన్నారు.

'గ్రామాల్లో సర్పంచ్ పాత్ర కీలకం'

నేరడిగొండ, ఫిబ్రవరి 6: గ్రామాల్లో సర్పంచ్ పాత్ర కీలకమని బోథ్ నియోజకవర్గం ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. మండలంలోని తేజాపూర్ గ్రామ సర్పంచ్ అల్లూరి ప్రఫుల్ చందర్‌రెడ్డి పదవి కాలం ముగియడంతో మంగళవారం కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఘనంగా సన్మానించారు. గత ఐదు సంవత్సరాల నుంచి ప్రజలకు సేవలు అందించడంలో క్రియాశీలపాత్ర పోషించారని అన్నారు. వారిలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఆడే వసంత్‌రావ్, పోతారెడ్డి, గంగాధర్, శంకర్ తదితరులున్నారు.

అందుబాటులో ఎరువులు : ఏవో

జైనథ్, ఫిబ్రవరి 6: మండలంలోని ఆయా గ్రామాల రైతులకు యాసంగి పంట కాలానికి యూరియా ఎరువులను అందుబాటులో ఉంచామని ఏవో వివేక్ కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎరువుల కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు.

కేస్లాపూర్ మర్రి చెట్టు నీడలో పటేళ్లు

- మర్రి చెట్టు వద్దకు చేరుకుని మెస్రం వంశీయుల పటేళ్ల విశ్రాంతి
- నాగోబా మహాపూజ నిర్వహణపై చర్చ
- నేడు తూం పూజలు



కోనేరుకు పూజలు చేస్తున్న మెస్రం వంశీయులు



మర్రి చెట్టు నీడలో గుడారాలు వేసుకున్న మెస్రంలు

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 6: ఆదివాసీల ఆరాధ్య దైవం కేస్లాపూర్ నాగోబా దేవత మహాపూజకు అవసరమగు పవిత్ర గంగాజలంతో సోమవారం ఇంద్రాయి దేవతకు పూజలు చేసి, అదేరాత్రి కేస్లాపూర్ మర్రి చెట్టు వద్దకు చేరుకున్నారు. మెస్రం వంశీయుల పటేళ్లు, అక్కడే గుడారాలు ఏర్పాటు చేసుకుని విశ్రాంతి తీసుకున్నారు. అక్కడే బస చేసి మంగళవారం ఉదయం సంప్రదాయ ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు నైవేద్యాలతో కూడిన వెదురు బుట్టలను వరుసలో ఉంచారు. దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. మర్రి చెట్టు వద్ద బస చేసిన మెస్రం వంశీయులకు మెస్రం ప్రధాన్ క్రికి వాయిస్తూ నాగోబా కథను పాట రూపంలో వినిపించారు.

● మెస్రం పటేళ్లకు ఘన స్వాగతం

పవిత్ర గంగాజలంతో మెస్రం వంశీయులు మర్రి చెట్టు వద్దకు సోమవారం రాత్రి చేరుకున్నారు. కాగా మంగళవారం రాత్రి ఆయా గ్రామాల నుంచి వస్తున్న మెస్రం పటేళ్లకు స్థానిక మెస్రం వంశీయులు ఘన స్వాగతం పలికారు.

● నేడు కర్మకాండ పూజలు

మెస్రం వంశీయులలో చనిపోయిన వారికి బుధవారం మర్రి చెట్టు వద్ద తూం (కర్మకాండ) పూజలు నిర్వహించనున్నారు. మెస్రం వంశీయులలో చనిపోయిన వారికి ఎవరైనా కర్మకాండలు జరపకపోతే నాగోబా చెంత ఉన్న మర్రి చెట్టు వద్ద పూజలు చేయడం మెస్రం గిరిజనుల ఆనవాయితీ.



నైవేద్యాలతో కూడిన వెదురు బుట్టలను వరుసలో ఉంచి దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేస్తున్న మెస్రం వంశీయుల మహిళలు

నాగోబా జాతర నిర్వహణకు పటిష్ఠ ఏర్పాట్లు

- కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశాలు
- 9నుంచి 15 వరకు మహా జాతర
- కేస్లాపూర్ దర్బార్ హాల్‌లో అధికారులతో సమీక్షా సమావేశం

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 6: నాగోబా జాతరను ఘనంగా, సంప్రదాయబద్ధంగా నిర్వహించేందుకు పటిష్ఠ ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. ఈనెల 9నుంచి 15వరకు నిర్వహించనున్న జాతర ఏర్పాట్లపై మంగళవారం ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ దర్బార్ హాల్‌లో ఐటీడీఏ ఇన్‌చార్జి ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తాతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఆలయ ప్రాంగణంలో చేపట్టనున్న జాతర ఏర్పాట్లను కలెక్టర్, పీవో, ఎస్పీ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం దర్బార్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజనుల ఆరాధ్య దైవం నాగోబా జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ నెల 9న రాత్రి మహాపూజతో జాతర ప్రారంభమవుతుందని, 12న దర్బార్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు శాఖల వారీగా చేపట్టిన పనులు 80శాతం పూర్తి అయినవని, మిగిలిన పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ శాఖల స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. జాతరకు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు అధికంగా వచ్చే అవకాశం ఉన్నందున శానిటేషన్, హైపోక్లోరైడ్ ద్రావణం పిచికారి చేయడం నిరంతరం జరగాలని, వీధి లైట్లు, హైమాస్ లైట్‌లను ఏర్పాట్లు చేయాలని పంచాయతీ అధికారులకు సూచించారు. వైద్య శిబిరాల ఏర్పాటుతో పాటు 104, 108 అంబులెన్స్‌లు, వైద్యసిబ్బందిని అందుబాటులో ఉంచి వైద్య సేవలు అందించాలని వైద్య శాఖ అధికారులకు ఆదేశించారు. నీటి సరఫరా సక్రమంగా జరగాలని, మరుగుదొడ్లు అవసరమైన మేరకు ఏర్పాటు చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. బారికేడ్స్ ఏర్పాటు చేసి దర్శనానికి పురుషులు, మహిళలకు వేర్వేరుగా ప్రవేశం కల్పించాలన్నారు. జాతరకు ప్రముఖులు, భక్తులు అధిక సంఖ్యలో రానున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా సీసీ కెమెరాలు, 24/7 పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. మర్రి చెట్టు ప్రాంతం, గోవాడ, దేవాలయ ప్రాంగణ సమీపంలో చేపట్టిన వివిధ పనులను వెంటనే పూర్తిచేయాలని అన్నారు. ఇంజనీరింగ్, విద్యుత్ సరఫరా నిరంతరం కొనసాగేలా అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలన్నారు. గిరిజన సంప్రదాయ పూజ కార్యక్రమాలకు అవసరమైన పూజ సామగ్రి, విద్యుదీకరణ వంటి పనులను దేవాదాయ శాఖ అధికారులు పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఐటీడీఏ ఇన్‌చార్జి ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా, ఎస్పీ గౌస్, శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మహతో, డీఎస్పీ నాగేందర్, జడ్పీటీసీ పుష్పలత, సర్పంచ్ రేణుక, ఆలయ కమిటీ సభ్యులు, ఈవో రాజమౌళి, కమిటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



జాతర ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కలెక్టర్, ఇన్‌చార్జి పీవో



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

పంచాయతీల అభివృద్ధికి సమన్వయంతో పని చేయాలి : కలెక్టర్

మావల, ఫిబ్రవరి 6: గ్రామ పంచాయితీల అభివృద్ధికి ప్రత్యేక అధికారులు, పంచాయితీ కార్యదర్శులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. మంగళవారం స్థానిక రత్న గార్డెన్‌లో ప్రత్యేక అధికారులు, పంచాయితీ కార్యదర్శులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖుష్బూగుప్తతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసినందున ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని 468 గ్రామ పంచాయితీలకు 184 మండలస్థాయి అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించడం జరిగిందని, ఈనెల 2వ తేదీన వీరు బాధ్యతలు స్వీకరించారని తెలిపారు. ఈనెల 7 నుంచి 15వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, ప్రతి ఇంటికి తాగునీరు అందించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. నూతన పంచాయితీ రాజ్ చట్టాలపై ప్రత్యేక అధికారులు పూర్తిఅవగాహన కలిగి ఉండాలని, పంచాయితీ కార్యదర్శుల సమన్వయంతో చేసుకుంటూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. గ్రామ పంచాయతీలలో నిత్యం జరిగే పారిశుధ్య నిర్వహణకు పర్యవేక్షించాలని అన్నారు. మరుగు కాలువలను శుభ్రం చేయించాలని, ప్రతీ ఇంటి నుంచి తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించాలని, హరితహారం కింద నాటిన మొక్కలను రక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నర్సరీలు, వైకుంఠధామలు, డంపింగ్ యార్డుల నిర్వహణ, విద్యుత్ దీపాల ఏర్పాటుపై పర్యవేక్షించాలని సూచించారు. ఈనెల 28 వరకు వంద శాతం ఇంటి పన్నులు వసూలు అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని, రానున్న వేసవి దృష్ట్యా తాగునీరు సరఫరాపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. ఉత్తమ గ్రామ పంచాయతీలకు అవార్డులు అందిస్తామని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా పంచాయితీ అధికారి శ్రీనివాస్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, మిషన్ భగీరథ ఎస్‌ఈ సురేష్, ప్రత్యేక అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీకి వెళ్లి వచ్చిన ఆదివాసీలకు సన్మానం

ఉట్నూర్, ఫిబ్రవరి 6: దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన గణతంత్ర వేడుకలకు హాజరై వచ్చిన ఆదివాసీలను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా సన్మానించారు. ఉట్నూర్ మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో దేశ రాజధానిలో జరిగిన రిపబ్లిక్‌డే ఉత్సవాలలో గిరిజన సంక్షేమ శాఖ ఆహ్వానం మేరకు పాల్గొన్న వాడగావ్‌కు చెందిన ఆత్రంటీంబాయి, పారగూడకు చెందిన కుంర దత్తాలను సన్మానించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌లు పలుకరించి గిరిజనుల సంస్కృతీ, ఆచార సంప్రదాయాలను, అడిగి తెలుసుకున్నారని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో డీడీ దిలీప్‌కుమార్, బీఎడ్ కళాశాల ప్రిన్సిపాల్ మేస్రం మనోహర్, పరిపాలనాధికారి సున్నం రాంబాబు, పీఎంఆర్సీ సభ్యులు దేవరావు, తదితరులు పాల్గొన్నారు.



ఆదివాసీలను సన్మానించిన ఇన్‌చార్జి పీవో ఖుష్బుగుప్తా

'యూత్ కాంగ్రెస్ శ్రేణులు పార్లమెంట్ ఎన్నికలకు సన్నద్ధమవ్వాలి'



భైంసా, ఫిబ్రవరి, 6 : నియోజవకర్గ పరిధిలోని యూత్ కాంగ్రెస్ శ్రేణులన్నీ బాధ్యతాయుతమైన విధానాల ద్వారా పార్లమెంట్ ఎన్నికలకు సన్నద్ధమవ్వాలని ముథోల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణ రావు పటేల్ పిలుపునిచ్చారు. మంగళవారం భైంసాలో నియోజకవర్గ పరిధిలోని ఏడు మండలాల, భైంసా పట్టణ యూత్ కాంగ్రెస్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపే ధ్యేయంగా యూత్ కాంగ్రెస్ శ్రేణులు ముందుకు సాగాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆరు గ్యారంటీ పథకాలు, సంస్కరణలపై విస్తృత ప్రచారం గావిస్తూ నియోజకవర్గ పరిధిలో పార్టీని పటిష్టపరచాలన్నారు. ఇదే క్రమంలో బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను క్షేత్ర స్థాయిలో ప్రజలకు వివరిస్తూ పార్లమెంట్ ఎన్నికల్లో పై చేయి సాధించేందుకు ప్రణాళికబద్ధంగా ముందుకు సాగాలన్నారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసే దిశగా ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా పార్టీకి పూర్వవైభవం తీసుకవచ్చేందుకు చేపట్టాల్సిన వివిధ అంశాలపై యూత్ కాంగ్రెస్ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఇందులో బ్లాక్ కాంగ్రెస్ ప్రతినిధులు శంకర్ చంద్రే, బెజ్జంకి ముత్యం రెడ్డిలతో పాటు నియోజకవర్గ పరిధిలోని యూత్ కాంగ్రెస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఫైనాన్స్‌పై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రొఫెసర్ రఘు

భైంసా రూరల్, ఫిబ్రవరి 6 : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫైనాన్స్ అంశంపై అసిస్టెంట్ ప్రొఫెసర్ రఘు విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం విద్యార్థిని విద్యార్థులకు అకౌంటింగ్ ఫైనాన్స్ వివిధ అంశాలపై ఉపన్యాస రూపంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, ఓం ప్రకాష్, జి. సుధాకర్ విద్యార్థిని విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

'భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు'

ఉట్నూర్, ఫిబ్రవరి 6: ఉమ్మడి జిల్లాలోని కేస్లాపూర్ నాగోబా జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట ఏర్పాట్లు చేపట్టాలని ఐటీడీఏ ఇన్‌చార్జి ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం రాత్రి ఐటీడీఏ కార్యాలయంలోని తన చాంబర్‌లో సంబంధిత శాఖల అధికారులతో నాగోబా జాతర ఏర్పాట్లను ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ గిరిజనుల ఆరాధ్య దైవం నాగోబా జాతరను ఘనంగా సాంప్రదాయబద్ధంగా నిర్వహించాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. ఫిబ్రవరి నెల 9 నుంచి 15 వరకు జరుగనున్న జాతరకు అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున శానిటేషన్, హైపోక్లోరైడ్ ద్రావణం పిచికారి చేయడం నిరంతరం జరగాలని, వీధి లైట్లు, హైమాస్ లైట్‌లను ఏర్పాట్లు చేయాలని, వైద్య శిబిరాల ఏర్పాటుతో అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచి నిరంతర వైద్య సేవలు అందించాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో డీడీ దిలీప్‌కుమార్, డీఎస్పీ నాగేందర్,ఈఈ రాథోడ్‌భీంరావ్, ఏపీవో భాస్కర్, ఈవో రాజమౌళి, ఏవో రాంబాబు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

'పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు'

బోథ్, ఫిబ్రవరి 6: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 2024-25 గానూ సంబంధించి 6 నుంచి పదో తరగతిలో ప్రవేశానికి గాను ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.ఉమేష్ రావు తెలిపారు. దరఖాస్తు చేసుకునేవారు మీ సేవ కేంద్రాల ద్వారా ఈ నెల 22వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆరవ తరగతిలో వంద సీట్లు, ఏడు నుంచి పది తరగతులకు ఖాళీగా ఉన్న సీట్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని, ఏప్రిల్ 7న ప్రవేశ పరీక్ష ఉంటుందని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

మతిభ్రమించి మాట్లాడుతున్నారు

● ఆదిలాబాద్ జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు ● బాల్క సుమన్ దిష్టిబొమ్మ దహనం ● పలుచోట్ల చెన్నూర్ మాజీ ఎమ్మెల్యేపై ఫిర్యాదులు



ఆదిలాబాద్‌లో బాల్కసుమన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 6: అధికారం పోయిందని బీఆర్ఎస్ నాయకులు మతిభ్రమించి మాట్లాడుతున్నారని యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చరణ్‌గౌడ్ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేసిన చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్ ఫ్లెక్సీని సోమవారం తెలంగాణచౌక్‌లో దహనం చేశారు. ఖబార్ధర్ బాల్క సుమన్ అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చరణ్‌గౌడ్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచితంగా మాట్లాడిన బాల్కసుమన్ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో గ్రామాల్లో యూత్ కాంగ్రెస్ నాయకులు తిరగనివ్వరని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇసాక్షేరు, నహీద్, భూపెల్లి శ్రీధర్, మోసిన్‌పటేల్, అర్భాత్ తదితరులు పాల్గొన్నారు. తర్వాత పట్టణ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో బాల్క సుమన్ పై కేసు నమోదు చేయాలని కోరుతూ టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదులు చేశారు. పట్టణ అధ్యక్షుడు గుడిపెల్లి నగేష్ ఆధ్వర్యంలో సీఐని కలిసి సీఎం పై అనుచితంగా మాట్లాడిన బాల్క సుమన్‌పై చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉట్నూర్: ఉమ్మడి జిల్లాలోని చెన్నూర్ మాజీ శాసనసభ్యుడు బాల్క సుమన్ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని చెప్పుతో కొడతానని ప్రకటించడాన్ని నిరసిస్తూ ఉట్నూర్ కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఉట్నూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు లింగంపల్లి చంద్రయ్య మాట్లాడారు. ఆయన వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఖయ్యుం, బిరుదుల లాజర్, కౌసల్య, అన్నపూర్ణ, నిస్సార్, దేవానందం, తదితరులు పాల్గొన్నారు.

జైనథ్: సీఎం రేవంత్‌రెడ్డిపై వివాదస్పద వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ నాయకులు బాల్క సుమన్ దిష్టిబొమ్మను మంగళవారం మండలకేంద్రంలోని స్థానిక అంతరాష్ట్ర రహదారిపై దహనం చేశారు.

క్రీడాకారులకు కలెక్టర్ అభినందన

ఉట్నూర్, ఫిబ్రవరి 6: జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పథకాలు సాధించిన ఉట్నూర్ గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాల గిరిజన విద్యార్థులను కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్‌లు అభినందించారు. ఉమ్మడి జిల్లాలోని కేస్లాపూర్‌లో గిరిజన క్రీడాకారులనుకలెక్టర్, ఎమ్మెల్యే, ఎస్పీ, ఇన్‌చార్జి పీవోలు ఘనంగా సన్మానించారు. జార్ఖండ్‌రాష్ట్రం రాంచీలో జనవరి 31నుంచి ఫిబ్రవరి 4వరకు జరిగిన జాతీయస్థాయి పాఠశాలల 14ఏళ్ల విభాగం బాలుర ఖోఖో పోటీల్లో తెలంగాణ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. ఈ జట్టులో పాఠశాలకు చెందిన మేస్రం నిఖిల్, ఆత్రం ఉదయ్‌కిరణ్‌లు కీలక పాత్ర వహించారన్నారు. నిఖిల్ ఈ పోటీల్లో ఉత్తమ అటాకింగ్ క్రీడాకారుడుగా అవార్డును సైతం అందుకున్నాడన్నారు. కాగా ఇటీవల లక్నోలో నిర్వహించిన జాతీయస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో పాఠవాలకు చెందిన ఆర్ విక్రమ్ 400 మీటర్ల రిలే పరుగు రజత పథకం సాధించారన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భవిష్యత్తులో ఈ విద్యార్థులు మరింత రాణించాలన్నారు. వీరికి అన్నివిధాలుగా సహకరిస్తామన్నారు. జాతీయస్థాయిలో ఉత్తమ క్రీడాకరులుగా నిలవడం అభినం దనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ విశ్వాస్ మహాతో, డీడీ దిలీప్ కుమార్, పీవీటీజీ ఏపీవో ఆత్రం భాస్కర్, జిల్లా గిరిజన క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారతి, బీఎడ్ కళావాల ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, ఏటీడీవో క్రాంతికుమార్, ఫిజికల్ డైరెక్టర్ జాదవ్ హేమంత్‌నాయక్‌లు పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ

గుడిహత్నూర్, ఫిబ్రవరి 6: మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ చూపి బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించినట్లు హెచ్ఎం దేవదాస్ తెలిపారు. ఈ నెల 4 వ తేదీ ఆదివారం మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ఆర్యవైశ్య ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో విద్యార్థులు పాల్గొన్నారు. కే.అనోకి బంగారు పతకం సాధించగా లోకండే అంజలి వెండి పతకం, ఎన్.రోష్ని కాంస్య పతాకం సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా శిక్షణ నిర్వహకురాలు కదం సునీత, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు వారిని అభినందించారు.

ప్రతీఒక్కరు ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి

ఇచ్చోడ, ఫిబ్రవరి6: ప్రతి ఒక్కరు అధ్యాత్మికతను అలవర్చుకోవాలని గ్రామానికి చెందిన సంతోష్, దేవరావ్ మహరాజ్‌లు అన్నారు. మంగళవారం మండలంలోని ముక్రా(బి) గ్రామంలో దిండి ప్రదక్షిణ వేడుకలను గ్రామస్థులు ఘనంగా జరుపుకున్నారు. ప్రతిమాసం ఏకాదశిని పురస్కరించుకొని గ్రామాల్లోని హనుమాన్, శివాలయం, పోచమ్మ ఆలయల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి వేడుకగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందని గ్రామస్థులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు అందరూ కలిసి స్థానిక ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రత్యేక దుస్తులను దరించి నృత్యాలు చేస్తూ ఊరేగింపుగా భజన సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, అడవ్ మారుతి, కైలాష్, దత్తురాం, సునీల్, మహిళలు, చిన్నారులు, తదితరులు పాల్గొన్నారు.

'కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి'

గుడిహత్నూర్, ఫిబ్రవరి 6: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రతీగ్రామంలో ఇంటింటికీ బ్రహ్మానంద్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని శివాలయ కళ్యాణ మండపంలో బోథ్ నియోజకవర్గ ఐదు మండలాల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపు కోసం ప్రతీ కార్యకర్త కష్టపడి పని చేయాలన్నారు. ప్రతీ గ్రామానికి కేంద్ర ప్రభుత్వం పథకాలు చేరాలనే ఉద్దేశంతో రాష్ట్ర పార్టీ చేపట్టే గావ్ ఛలో, బస్తీ ఛలో కార్యక్రమాన్ని విజయవంతంచేయాలని కోరారు. ఇందులో ఘటిక క్రాంతికుమార్, జిల్లాపరిషత్ చైర్మన్ రాథోడ్ జనార్ధన్, పార్లమెంట్ కో కన్వీనర్ మయూర్ దయానంద్, జిల్లా ఉపాధ్యక్షుడు బాబారావు, మాధవరావు, భీంరెడ్డి, ప్రజాప్రతినిధులు, మండల నాయకులు పాల్గొన్నారు.

కుంటాల పీఏసీఎస్ చైర్మన్‌పై అవిశ్వాసం



కుంటాల సహకార సంఘం

కుంటాల, ఫిబ్రవరి, 6 : కుంటాల సహకార సంఘం అధ్యక్షులు సట్ల గజ్జారాంపై డీసీవో నర్సయ్యకు డైరెక్టర్‌లు ఏడుగురు మంది సంతకాలతో కూడిన అవిశ్వాస తీర్మానాన్ని అందజేసినట్లు డీసీవో నర్సయ్య తెలిపారు. సహకార సంఘంలో మొత్తం 13 మంది డైరెక్టర్‌లు ఉండగా ఏడుగురు సభ్యులు సంతకాలతో కూడిన అవిశ్వాస తీర్మానాన్ని తనకు అంజేసినట్లు ఆయన తెలిపారు. ఈ అవిశ్వాస తీర్మానంలో బీఆర్ఎస్ పార్టీ మద్దతుదారుడైన సట్ల గజ్జారాం డైరక్టరైన తమను బేఖాతరు చేస్తూ ఇష్టారీతిన నిర్ణయాలు తీసుకుంటూ కుంటాల సొసైటిని అప్రతిష్ట పాలు చేస్తున్నారని పేర్కొన్నట్లు ఆయన తెలిపారు. మండల ప్రజలు రైతుల నుండి వచ్చిన డిమాండ్‌లను దృష్టిలో పెట్టుకొని తాము ఈ అవిశ్వాస తీర్మాణం పెట్టినట్లు డైరెక్టర్‌లు తెలిపారన్నారు. కాగా సొసైటి చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం నోటీసు అందిన మాట వాస్తవమేనని త్వరలోనే తేది ప్రకటిస్తామని డీసీవో నర్సయ్య తెలిపారు.

గుండెపోటుతో హెడ్ కానిస్టేబుల్ మృతి

భైంసా, ఫిబ్రవరి, 6 పట్టణ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం. భోజరాం (52) మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. ఉదయం విధులు నిర్వహించుకొని మధ్యాహ్నం ఇంటికి వెళ్లిన భోజరాం గుండెపోటు కుప్పకూలి పడిపోయాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లుగా వెల్లడించారు.

పరిమితికి మించి వేగంగా

వాహనాలు నడిపితే ప్రమాదమే



కాల్వలో హెల్మెట్‌లు పంపిణీ చేస్తున్న ఎస్సై

దిలావర్‌పూర్, ఫిబ్రవరి 6 : పరిమితికి మించి వేగంగా వాహనాలు నడిపితే ప్రమాదం కొనితెచ్చుకోవడమేనని ప్రముఖ వైద్యులు డా.రాకేష్ అన్నారు. జాతీయ రోడ్డు రవాణా భద్రత వారోత్సవాల్లో భాగంగా పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం కాల్వలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. హాస్పిటళ్లకు వచ్చే రోడ్డు ప్రమాద బాధితులను పరిశీలిస్తే 75 శాతం ప్రమాదాలు మద్యం సేవించి, సెల్ ఫోన్ మాట్లాడుతూ, రాష్ డ్రైవింగ్, అతివేగంగా వాహనాలు నడపడం వల్లనే జరుగుతున్నాయన్నారు. ఆసుపత్రుల్లో ప్రమాద బాధితుల కుటుంబ సభ్యులను చూస్తే కళ్లల్లో నీళ్ల తిరుగుతాయన్నారు. మీకు అనుకోకుండా ప్రమాదం జరిగి జరుగరానిది జరిగితే మీ మీద ఎన్నో ఆశలు పెట్టుకున్న మీ తల్లిదండ్రులు, భార్య, పిల్లల పరిస్థితి ఎలా ఉంటుందో ఆలోచించాలన్నారు. ఎస్సై యాసిర్ అరాఫత్ మాట్లాడుతూ... వాహనాలు నడిపే సమయంలో ద్విచక్ర చోదకులు హెల్మెట్ తప్పనిసరి ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రత్యేక అధికారి స్రవంతి, కాల్వ దేవస్థానం చైర్మన్ మహేష్, స్థానిక నాయకులు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.


'ఉద్యమకారులపై

పోలీస్ కమిషనర్ అనుచిత వ్యాఖ్యలు'


నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 6 : ప్రజా ఉద్యమకారులపై ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని సీపీఎంఎల్ ప్రజాపంథా మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి కె.రాజన్న అన్నారు. జిల్లా కేంద్రం




లోని ధర్నా చౌక్ వద్ద పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఆయన ఖమ్మంలో జరిగిన చిన్నగొడవను భూతద్దంలో చూపి రౌడీషీటర్లు అంటూ అనుచిత వ్యాఖ్యలు చేసి అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపడాన్ని తీవ్రంగా ఖండించారు. అరెస్టు చేసిన నాయకులను వెంటనే విడుదల చేసి అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు కే.లక్ష్మి, ఎస్.గంగన్న, వి.మ హేందర్, ఎస్.లక్ష్మి, గఫూర్, పోశెట్టి, రాజారాం పాల్గొన్నారు.













● నేటి నుంచి వారం రోజుల పాటు పారిశుధ్య కార్యక్రమాలు ● సమస్యల గుర్తింపు, పరిష్కారం పై దృష్టి
● ప్రత్యేకాధికారులపై ప్రధాన బాధ్యత ● జిల్లాలో 396 గ్రామ పంచాయతీలు

ఇక ఆదర్శ పంచాయతీలు


రోడ్లను శుభ్రపరుస్తున్న పారిశుధ్య సిబ్బంది

భైంసా, ఫిబ్రవరి 6 : గ్రామపంచాయతీలను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్రప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రతిపల్లెను పరిశుభ్రంగా మార్చాలనే ఉద్దేశ్యంతో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమ నిర్వహణకు శ్రీకారం చుట్టింది. గ్రామాల్లో అభివృద్ధి పనులతో పాటు పారిశుద్ధ్యం, ఇతర పనులను చేపట్టేందుకు కార్యాచరణ రూపొందించింది. జిల్లావ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో ఈ నెల 7 నుంచి 15 వరకు ప్రత్యేక పారిశుద్ధ్యం కార్యక్రమాలను ముమ్మరంగా చేపట్టనున్నారు. సర్పంచుల పదవీకాలం పూర్తవడంతో వారి స్థానంలో ఇటీవల బాధ్యతలు చేపట్టిన ప్రత్యేకాధి కారులు ఈ కార్యక్రమాలను పకడ్బందీగా చేపట్టేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టాలని దిశానిర్ధేశం చేశారు. మారుమూల గ్రామ పంచాయతీల నుంచి మండల కేంద్రాల వరకు 15వ ఆర్థికసంఘ నిధులతో ఈ కార్యక్రమాలు చేపట్టేలా ప్రణాళిక రూపొందించారు. వీటిల్లో గ్రామ యువత, మహిళా స్వయం సహాయక సంఘాలతో పాటు స్వచ్ఛంద సంస్థలను భాగస్వామ్యం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

● ఉత్తమ పంచాయతీల ఎంపిక

జిల్లాలోని 396 గ్రామపంచాయతీల్లో వారం పాటు చేపట్టే ఈ కార్యక్రమాల్లో తొలిరోజు ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పర్యటించి సమస్యలు గుర్తించాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. రోజువారిగా కార్యాచరణ రూపొందించి వారంలో ఆయా సమస్యల్నింటిని పరిష్కరించాలని సూచించారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, ప్రజలకు సురక్షితమైన మంచినీరు సరఫరా చేయా లన్న ప్రధానలక్ష్యంగా ప్రనాళిక రూపొందించాలని ఆదేశించారు. రానున్న వేసవిలో మంచినీటి ఎద్దడి రాకుండా చూసేలా ఆదేశించారు. పారిశుద్ధ్య కార్యక్రమాల చివరిరోజు పండగ వాతావరణంలో ముగింపు కార్యక్రమం చేపట్టేలా ఉత్తర్వులు జారీ చేశారు. పనితీరు ఆధారంగా ఉత్తమ పంచా యతీలను ఎంపిక చేసి ప్రశంసాపత్రాలు అందించనున్నారు.

● వేధిస్తున్న కార్మికుల కొరత

వారం పాటు చేపట్టే పారి శుద్ధ్య కార్యక్రమాల్లో కార్మికులు కీలకపాత్ర పోషించాల్సి ఉంది. కానీ జిల్లా వ్యాప్తంగా పంచాయతీల్లో కార్మి కుల కొరత వేధిస్తోంది. మేజర్, పెద్ద పంచాయతీల్లో సిబ్బంది కొరత అధికంగా ఉంది. దీంతో ఆయా పంచాయతీల్లో ఈ కార్యక్రమాల నిర్వహణ కత్తిమీద సాములా మారనుంది. రోజుకో కార్యక్రమం చొప్పున గ్రామం మొత్తం ఒకే రోజులో పూర్తి చేయాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం ఉన్న సిబ్బందిపై ఒత్తిడి అధికమవుతోంది. వారం రోజుల పాటు అదనపు కూలీలను తీసుకొని పనులు చేపడితే లక్ష్యం చేరే అవకాశం ఉంటుంది.

● ప్రత్యేక కార్యక్రమాలు ఇలా

రోజూ అంతర్గత, ప్రధానరోడ్లను శుభ్రపరచాలి, అన్ని మురుగు కాల్వల్లో పూడికలు తీయాలి, ఇతర చిన్నకాల్వలు పూడ్చి, నీరు నిల్వకుండా చూసుకోవాలి గ్రామపంచాయతీలోని అన్ని వీధుల్లో గుంతలు పూడ్చాలి. పాఠశాలలు, అంగన్‌వాడీలు, ఆరోగ్య కేంద్రాలు, మార్కెట్ స్థలాలు, బస్టాప్‌లు, ఇతర అన్ని ప్రభుత్వ సంస్థలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి, ఖాళీగా ఉన్న ప్లాట్ల శుభ్రం, శిథిలావస్థలకు చేరిన ఇళ్లు, భవనాల తొలగింపు పాడుబడిన బావుల పూడ్చుట, ఉపయోగంలో లేని బోరు బావుల మూసివేయాలి, మురుగు కాలువల్లో నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో ఆయిల్‌బాల్స్ వేయాలి. యాంటీ లార్వా రసాయనాలు, వీధుల్లో దోమల మందు పిచికారి గ్రామపంచాయతీల్లో గల అన్ని ఇళ్లలో శుక్రవారం డ్రై డేగా పాటించాలి

ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు



ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను చేపడుతాం. ప్రణాళికబద్ధమైన విధానాల ద్వారా షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహిస్తాం. గ్రామాల్లోని అన్ని వర్గాల ప్రజానీకం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమ విజయవంతానికి బాధ్యతాయుతంగా వ్యవహరించాలి

శివకృష్ణ, భైంసా డివిజనల్ పంచాయతీ అధికారి

పంచాయతీలను ఆదర్శంగా తీరిదిద్దుతాం



ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణ ద్వారా గ్రామ పంచాయతీలను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం. పారిశుధ్య నిర్వహణ వ్యవస్థను మెరుగుపరుస్తాం. గ్రామాల్లో నెలకొన్ని ఉన్న సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతాం. పాడుబడ్డ బావులను పూడ్చివేసి ఉపయోగంలోని బోరుబావులను మూసివేయిస్తాం

డా.విఠల్, ప్రత్యేకాధికారి, మాంజ్రి గ్రామ పంచాయతీ, భైంసా మండలం


విపత్తుల సమయంలో తీసకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పిస్తున్న ఎన్‌డీఆర్ఎఫ్ అధికారులు

విపత్తుకాలంలో సమయస్ఫూర్తితో వ్యవహరించాలి

● చీఫ్ కమాండర్ ఇన్‌స్పెక్టర్ పింటూ నంది

భైంసా, ఫిబ్రవరి 6 : ప్రకృతి వైపరీత్యాల సమయంలో భీతిల్లిపోకుండా అప్రమత్తత విధానాలతో సమయస్ఫూర్తితో వ్యవహరించాలని ఎన్‌డీఆర్ఎఫ్ 12వ బెటాలియన్ చీఫ్ కమాండర్ ఇన్స్‌పెక్టర్ పింటూ నంది సూచించారు. మంగళవారం భైంసా పట్టణంలోని కిసాన్‌గల్లి పాత మున్సిపల్ కార్యాలయ భవనంలో ఎన్‌డీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో జాతీయ ప్రకృతి వైపరిత్యాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. అపత్కాల సమయంలో ప్రాణ రక్షణ కోసం తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. వైపరిత్యాలలో గాయపడిన వారికి అందించాల్సిన ప్రథమ చికిత్స ప్రమాదం నుంచి రక్షించాల్సిన విధానాలను ప్రయోగాత్మకంగా వివరించారు. వరదల్లో చిక్కుకున్న బాధితులు వ్యవహరించాల్సిన తీరు, వారిని కాపాడేందుకు అవలంభించాల్సిన విధానాలపై అవగాహన కల్పించారు.ఇందులో భైంసా పట్టణ పరిధిలోని పొదుపు సంఘాల శ్రేణులు, వివిధ కాలనీలవాసులు పాల్గొన్నారు.

ప్రధాని నరేంద్రమోదీ హయాంలో ఎనలేని అభివృద్ధి


మాట్లాడుతున్న రాంనాథ్

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 2 : ప్రధాన నరేంద్రమోదీ పదేళ్ల పాలనలో దేశం ఎనలేని అభివృద్ధి సాధించిందని బీజేపీ నాయకుడు రావుల రాంనాథ్ అన్నారు. మంగళవారం సోన్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్‌బూత్ కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... 60 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో లేని అభివృద్ధి కేవలం మోదీ నేతృత్వంలో సాధ్యమైందన్నారు. రైతులు, మహిళలు, దళిత గిరిజనులు అభివృద్ధి చెందుతున్నారన్నారు. అయోధ్యలో రామ మందిర నిర్మాణం చేసి ప్రజల మన్ననలు పొందారన్నారు. మూడోసారి మోదీ ప్రధాని కావలసిన అవసరం దేశానికి ఉందన్నారు. బీజేపీ అభ్యర్థుల గెలుపుకు ప్రతిఒక్క కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు మోతుకుపెల్లి నరేష్, నర్స య్య, సంతోష్, బాలకృష్ణ పోశెట్టి పాల్గొన్నారు. రక్తదాన శిబిరం నిర్వహించి సహపంక్తి భోజనం చేశారు.

దస్తూరాబాద్‌లో బాల్క సుమన్ దిష్టిబొమ్మ దహనం

దస్తూరాబాద్, ఫిబ్రవరి 6 : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై బాల్క సుమన్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ శ్రేణులు దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దుర్గం మల్లేష్ మాట్లాడుతూ... బాల్క సుమన్ నోరు అదుపులో పెట్టుకోవాలని సూచించారు. ఓటమిని తట్టుకోలేకనే బీఆర్ఎస్ నాయకులు ఇటువంటి అసభ్యకరమైన మాటలకు పాల్పడుతున్నారన్నారు. అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు పుల్యా నాయక్, వెంకటేష్, మునేసుల రాజన్న, గోపి, ప్రసాద్, నరేష్, నాగరాజ్, శ్రీను, రవి, శ్రీధర్, శ్రీనివాస్, మహేష్, గంగమల్లు, తదితరులు పాల్గొన్నారు.

నూతన కోర్టు భవన నిర్మాణం ప్రస్తుత చోటే జరగాలి


మాట్లాడుతున్న న్యాయవాది మల్లారెడ్డి

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 6 : నిర్మల్‌లో నిర్మించబోయే కోర్టుభవనం ప్రస్తుతం ఉన్న సముదాయంలోనే జరుపాలని న్యాయవాది ఆలూరి మల్లారెడ్డి న్యాయ వ్యవహారాల కార్యదర్శి రేండ్ల తిరుపతిని కోరారు. మంగళవారం సచివాలయంలో తిరుపతిని కలిసి నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయడానికి సహకరించాలని న్యాయవాదుల తరఫున విజ్ఞప్తి చేశారు. తగిన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఆయన స్పందించి ఉన్నతాధికారులతో మాట్లాడుతానని చెప్పారని మల్లారెడ్డి తెలిపారు.

జాతీయ వేదికపై ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ప్రతిభ

● జాతీయ స్థాయిలో రెండో బహుమతి సాధించిన విద్యార్థులు
● విద్యార్థులను అభినందించిన యూనివర్సిటీ అధికారులు


విజేతగా నిలిచిన విద్యార్థులను అభినందిస్తున్న బాసర ట్రిపుల్ ఐటీ వైస్ చాన్స్‌లర్ వెంకటరమణ

బాసర, ఫిబ్రవరి, 6 : జాతీయస్థాయి పోటీల్లో జిల్లా బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీ విద్యార్థులు సత్తా చాటారు. మహారాష్ట్రలోని బాంబే ఐఐటీలో ఫిబ్రవరి 2వ తేదీ నుంచి జరుగుతున్న నేషనల్ ఆంట్రోప్రెన్యూర్‌షిప్ చాలెంజ్ పోటీల్లో బాసరకు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపారు. దేశ నలుమూలల నుంచి వచ్చిన 660 టీంలు పాల్గొనగా.. వారందరినీ వెనక్కి నెట్టి విజేతగా నిలిచారు. బాసర విద్యార్థుల టీమ్ జెనిత్ రన్నరప్‌గా నిలిచి రూ.60,000ల ప్రైజ్ మనీని కూడా సొంతం చేసుకున్నారు. ఒక వ్యాపారసంస్థ, లేదంటే ఇతర స్టార్టప్‌కు వచ్చే అవకాశాలు, లాభాలతో పాటు ఎదురయ్యే సవాళ్ల గురించి విద్యార్థులు ఈ సమ్మిట్‌లో వివరించారు. యూనివర్సిటీలో నేర్చుకున్న విషయాలను విద్యార్థులు ఈ సమ్మిట్‌లో వివరించి అందరినీ మెప్పించారు. బాసర ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ రాకేష్ రెడ్డి, ఓవరల్ కోఆర్డినేటర్ లక్ష్మణచారి, విద్యార్థులు వైష్ణవి, ఫాతికా, రోహిత్, లలిత్, అక్షయ్, అతిబ్, మనోజ్ఞ,మైథిలి, సందీప్, దేవిప్రియ, సాయికిరణ్‌లు ఈ పోటీల్లో పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను, అందుకు ప్రోత్సహించిన కోఆర్డినేటర్‌లను వైస్ చాన్సలర్ వెంకటరమణ, డైరెక్టర్ సతీష్‌కుమార్‌లు మంగళవారం యూనివర్సిటీలో అభినందించారు.

ఇళ్లు అప్పచెప్పాలంటూ

డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారుల ఆందోళన

భైంసా, ఫిబ్రవరి 6 : లక్కీ డ్రాలో ఎంపికైన తమకు ఇండ్లు అప్పచెప్పాలంటూ భైంసా పట్టణ డబుల్‌బెడ్‌రూమ్ పథక లబ్ధిదారులు ఆందోళనలు చేపట్టారు. మంగళవారం మధ్యాహ్నం వేళలో పలువురు లబ్ధిదారులు డబుల్ బెడ్ రూం భవన సముదాయం వద్దకు నిత్యావసర సరుకులు, సామాగ్రితో చేరుకున్నారు. గత యేడాది లబ్దిదారులుగా ఎంపికైన తమకు ఇండ్లు అప్పచెప్పాలంటూ సముదాయంలోకి వెళ్లేందుకు విఫలయత్నం చేశారు. సంబంధిత సమాచారం అందుకున్న పట్టణ పోలీసులు వారిని లోనికి వెళ్లకుండా నిలువరించారు. అధికారులు ఆదేశాలు ఇచ్చేంత వరకు ఇండ్లలోకి వెళ్లరాదంటూ పోలీసులు అడ్డుకున్నారు. దీంతో లబ్దిదారులు భవన సముదాయం ప్రవేశ మార్గం వద్ద తమ కుటుంబీకులతో కలిసి నిరసన ప్రదర్శనలు చేపట్టారు. గత యేడాది ఎంపిక చేసి ఇప్పటి వరకు ఇండ్లు కేటాయించక పోవడం విడ్డూరంగా ఉందంటూ ఆందోళనలు చేపట్టారు.వారందరిని పోలీసులు సముదాయించి అధికారులను సంప్రదించిన సమస్యను పరిష్కరించుకోవాలని సూచించి సముదాయించారు.దీంతో శాంతించిన లబ్దిదారులు మూడు రోజుల వ్యవధిలోగా తమ ఇండ్లు కేటాయించక పోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని వెల్లడించి అక్కడి నుంచి వెనుతిరిగిపోయారు.

చెరువుల పరిరక్షణకు చర్యలు చేపట్టాలి : కలెక్టర్


సమీక్ష జరుపుతున్న కలెక్టర్

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 6 : చెరువుల సంరక్షణ కమిటీ సభ్యులు అధికారులు కలిసి చెరువుల పరిరక్షణకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. మంగళవారం సభ్యులు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... జిల్లాలో ఉన్న చెరువులు అన్యాక్రాంతం కాకుండా ఉండేందుకు కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. జల వనరుల సంరక్షణకు చెరువులను పరిశీలించాలన్నారు. ఎఫ్టీఎల్, సర్వే నంబర్లు గుర్తించి నివేదికలు సమర్పించాలన్నారు. ఆక్రమణకు అడ్డుకట్ట వేసేందుకు కమిటీలు పకడ్బందీగా వ్యవహరించాలన్నారు. గూగుల్ మ్యాప్ ద్వారా జౌళినాల, పట్టణ పరిసరాల ప్రాంతాల్లో ముంపుకు గురయ్యే కాలనీలు, వీధులను పరిశీలించారు. అదనపు కలెక్టర్లు కిషోర్ కుమార్, ఫైజాన్ అహ్మద్, ఆర్డీవో రత్నకల్యాణి పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను పరిశీలించిన కలెక్టర్

రాబోయే పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల తనిఖీలో భాగంగా కలెక్టర్ మంగళవారం తనిఖీ చేశారు. ఈవీఎం గోదాంలో మొదటి విడత తనిఖీని పరిశీలించారు. సీయూ, బీయూ, వీవీ ప్యాట్‌లను పరిశీలించి సూచనలు చేశారు. అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలు కాపాడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉంది

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 6 : శాంతి భద్రతలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని డీజీపీ డీజీపీ రవిగుప్తా సూచించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలపై ఆయన మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా ఎస్పీజానకి షర్మిల పాల్గొన్నారు. జిల్లా పరిస్థితిపై ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అడిగి తెలుసుకున్నారు. భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, డీసీఆర్బీ డీఎస్పీ రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



డీజీపీతో వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా పోలీసు అధికారులు

ఇంద్రవెల్లి కాల్పుల పాపం కాంగ్రెస్‌దే

● 60 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఏనాడు ఆదివాసీలను పట్టించుకోలేదు ● గిరిజనుల ఓట్ల కోసమే ఇంద్రవెల్లిలో సీఎం రేవంత్‌సభ
● రైల్వే లైన్ కోసం నయా పైసా కేటాయించని కేంద్రం ● మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : 1981లో కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా అంజయ్య ఉన్న సమయంలోనే ఇంద్ర వెల్లిలో ఆదివాసీలపై కాల్పులకు తెగబడ్డారని, ఆ పాపం ముమ్మాటికీ కాంగ్రెస్ పార్టీదేనని మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం నిర్మల్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివాసీల చట్టబద్ధమైన హక్కుల కోసం గిరిజన రైతుకూలీ సంఘం నాటి ఇంద్రవెల్లి బహిరంగసభకు పిలుపునివ్వగా, సభ నిర్వహణకు మొదట పోలీసులు అనుమతించారన్నారు. ఆ తర్వాత చివరి నిమి షంలో అనుమతి రద్దు చేసిన విషయం తెలియని ఆదివాసీలు ఇంద్రవెల్లికి వేలాదిగా చేరుకున్నారన్నారు. పోలీసులు జనాన్ని కట్టడి చేసే క్రమంలో అరగంట పాటు కాల్పులు జరపడంతో అనేక మంది ప్రాణాలు కోల్పోగా, వందలాది మంది గాయపడ్డారన్నారు. నాడు ఆదివాసీలపై పోలీసులు జరిపిన కాల్పుల్లో సుమారు 250 మందికి పైగా ఆదివాసీలు మరణించరన్నారు. నాటి నుంచి నేటి వరకు 60 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఏనాడు ఆదివాసీలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. గత చరిత్ర తెలియని ఇప్పటి సీఎం రేవంత్‌రెడ్డి గిరి జనుల ఓట్ల కోసం ఇంద్రవెల్లిలో సభను పెట్టారని ఆరోపించారు. సీఎం హోదా లో రేవంత్‌రెడ్డి ఇంద్రవెల్లిలో సభ నిర్వహించగా, కేవలం కేసీఆర్ కుటుంబాన్ని విమర్శించడానికి ప్రాధాన్యతను ఇచ్చారన్నారు. తొలిసారి ముఖ్యమంత్రి రాకతో తమ ప్రాంతం అభివృద్ధి చెందు తుందన్న ఆదివాసీల ఆశలను సీఎం రేవంత్‌రెడ్డి వమ్ము చేశారన్నారు. ఆదివాసీలు, గిరిజనుల అభివృద్ధి కోసం నయాపైసా కేటాయించక పోవడం శోచనీయమన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే గిరిజన గూడాల్లో ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. అడవి బిడ్డల సంక్షేమమే ధ్యేయంగా గత సీఎం కేసీఆర్ అనేక పథకాలను అమలు చేశార న్నారు. ముఖ్యంగా మారుమూల గ్రామాల్లో మౌలికవసతులు కల్పించడంతో పాటు పోడుపట్టాల పంపిణీతో దశాబ్దాల కల నెరవేర్చిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. తండాలు, గూడా లను గ్రామ పంచాయతీలుగా మార్చి అభివృద్ధికి బాటలు వేశారన్నారు. సీఎం హోదాలో కేసీఆర్ ఇంద్రవెల్లి పర్యటించి నప్పుడు నాగోబా ఆలయానికి రూ.ఆరు కోట్ల నిధులను మంజూరు చేశార న్నారు. అంతేకాకుండా దశాబ్దాలుగా సరైన రోడ్డుమార్గానికి కూడా నోచుకోని జోడేఘాట్ గ్రామానికి 15.95 కోట్లతో రెండు వరుసల రహదారిని గత ప్రభుత్వం నిర్మించిందని గుర్తు చేశారు. జోడేఘాట్‌లో పురుగు 25 కోట్లతో స్మారకచిహ్నాం, గిరిజన మ్యూజియం నిర్మించి కొమురం భీమ్ ఖ్యాతిని ప్రపంచానికి తెలిసేలా చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమే నని స్పష్టం చేశారు. ఆదివాసుల మనోభావాలకు అనుగుణంగా అప్పటి ప్రభుత్వం వారి సంక్షేమానికి బాటలు వేసిందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. తప్పుడు వాగ్దానాలు ఇచ్చి గద్దెనెక్కిన సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికైనా వాస్తవాలు తెలుసుకొని ఇచ్చిన హామీల అమలుకు కట్టుబడి ఉండాలన్నారు. జిల్లాకు రైల్వేలైన్ తీసుకొస్తామని బీజేపీ నాయకులు ఓటర్లను మభ్యపెట్టారన్నారు. బడ్జెట్‌లో రైల్వేలైన్ ఊసే లేకపోగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధి కోసం నయాపైసా కేటాయించలేదన్నారు. రైల్వేలైన్ విషయంలో జిల్లా ప్రజలకు ఎంపీ సోయం బాపురావు, నిర్మల్, ముథోల్ ఎమ్మెల్యేలు మహేశ్వర్‌రెడ్డి, రామారావు పటేల్‌లు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. ప్రస్తుత ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి అధికారులను వేదిస్తుండడంతో ఉద్యోగులు సెలవు పెట్టి వెళ్లిపోతున్నారన్నారు. ఇథనాల్ ఫ్యాక్టరీకి భూములను అధికరేట్లకు కట్టబెట్టి కోట్లను దండుకున్నట్లు ఎమ్మెల్యే అనుచరులపై ఆరోఎణలు వస్తున్నాయని, వారిపై ఎందుకు చర్యలు తీసుకోరని మహేశ్వర్‌రెడ్డిని ప్రశ్నించారు. సమావేశంలో బీ ఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు విఠల్‌రెడ్డి, ఖానాపూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్‌నాయక్, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి అల్లోల

సంక్షిప్త సమాచారం

ఇద్దరు అటవీశాఖ

అధికారుల సస్పెన్షన్

జిల్లా సరిహద్దు ప్రాంతంలో టేకు చెట్ల నరికివేతతో ఒక ఎఫ్ఎస్‌వో, ఎఫ్‌బీవోపై వేటు

ఖానాపూర్, ఫిబ్రవరి 6 : కడెం మండలం ఉడుంపూర్ రేంజ్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఎఫ్ఎస్‌వో లక్కవత్తుల రవికుమార్, ఎఫ్‌బీవో ఎం. భూమేష్‌లపై అటవీశాఖ అధికారులు వేటు వేశారు. ఇటీవల మంచిర్యాల ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం తనిఖీల్లో నిర్మల్ జిల్లా సరిహద్దు ప్రాంతమైన ఉడుంపూర్ రేంజ్ పరిధిలోని ఇస్లాంపూర్ అడవుల్లో టేకు చెట్లు నరికివేతకు గురైనట్లు గుర్తించింది. ఈ టేకు చెట్ల విలువ రూ.3,61,640 ఉంటుందని ఉన్నతాధికారులకు నివేదిక పంపింది. దీంతో సంబంధిత ఉడుంపూర్ రేంజ్ పరిధిలోని ఇస్లాంపూర్ ఎఫ్ఎస్‌వో రవికుమార్, ఎఫ్‌బీవో భూమేష్‌లను సస్పెండ్ చేస్తూ నిర్మల్ ఫోస్ నుంచి ఉత్తర్వులు వెలువడినట్లు ఖానాపూర్ ఎఫ్‌డీవో కార్యాలయం సూపరిండెంట్ రాజేంద్ర కుమార్ తెలిపారు.

అవినీతి అధికారులపై

చర్యలు తీసుకోవాలి

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 6 : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అవినీతికి పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త సయ్యద్ కలీం ఏసీబీ డైరెక్టర్ జనరల్ సీవీ ఆనంద్‌ను కోరారు. హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. పూర్తిస్థాయిలో ఏసీబీ అధికారుల నియామకాలు చేపట్టాలని కోరారు. లంచాలు అడిగే అధికారులపై నిర్భయంగా ఫిర్యాదు చేయవచ్చునని డైరెక్టర్ తెలియజేశారని తెలిపారు.

నేటి నుంచి గృహజ్యోతి సర్వే

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 6 : ప్రభుత్వం ప్రారంభించబోయే గృహజ్యోతి పథకానికి బుధవారం నుంచి జిల్లాలో సర్వే ప్రారంభిస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఎస్ఈ జేఆర్ చౌహాన్ తెలిపారు. వినియోగదారులు ఆధార్ కార్డు, ఆహార భద్రత రేషన్‌కార్డు, సర్వీస్ కనెక్షన్ నెంబర్ బిల్లింగ్ చేయడానికి వచ్చే సిబ్బందికి చూపించి సహకరించాలని కోరారు.